# ★ అవకాశవాది ఆత్మప్రశంస ★

చోడవరపు బాబూరావు

అమాంతంగా మంత్రినైపోయాను. ఎట్లా ఐపోయావూ అని మాత్రం అడక్కండి; అదంతా చిదంబర రహస్యం. ఇదివరకు కాంగ్రెసులో ఎక్కడావున్నట్లు కనపడవే, మరి కాంగ్రెసు ప్రభుత్వం నీకు మంత్రిపదవి యెట్లా యిచ్చిందంటారా? అట్లా దారికిరండి చెపుతాను.

అవునయ్యా, కాంగ్రెసుకు వ్యతిరేకంగా పని చేసిన మాట నిజమే. అసలు మొదట్లో నా ఉద్దేశమేమిటీ అంటే, బ్రిటిషువాళ్ల ప్రభుత్వంలోనే కాస్త యేదో వాళ్ళకి ఆసరాగావుంటూ నాలుగురాళ్లు వెనకవేసుకుందామని ఆశించాను. వర్తకవ్యాపారం-అంటే ఇప్పటి కుర్రకారు నల్ల మార్కెట్టంటారే, అది-దాంట్లో ఏదో కాస్త వెనక వేసుకున్న మాట నిజమే. అసలు మళ్ళీ మాట్లాడితే నల్ల మార్కెట్ ఏమిటీ అని అడుగుతా! దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోటం తప్పంటారా? ఈ సంగతి యిట్లావుండగానే వాడు ఆనారాయుడు-పాపం వర్తకంలో నాకు చాలా ఆసరాగా వుండేవాడు లెండి-ఓరోజున కనపడి గాంధీ టోపీ చేతికిచ్చాడు. 'ఇదెందుకోయ్!' అన్నాను. 'నీ కింకా తెలీదూ! అయితే విను. బ్రిటిషువాళ్ళు వెళ్లి పోతున్నారుట' అన్నాడు. 'అయ్యో పాపం! అయితే యీ టోపీ యెందుకు?' అన్నాను. 'ఇంకా ఎందుకంటా వేమిటోయ్? రేపు కాంగ్రెసు వాళ్లు గద్దె లెక్కింతర్వాత ఈ టోపీ లేకపోతే యెందుకన్నా పనికి వస్తామా మనం?' అన్నాడు. 'మరి మన వర్తకంమాట?' అన్నాను. 'వర్తకం వర్తకంలాగే వుంటుంది! కాకపోతే పేరు మారుతుంది' అన్నాడు. 'ఎట్లా మారుతుందేమిటి?' అని అడిగాను. 'దేశసేవ-అంటే నీకు తెలియతే. అదీ చాలా లాభసాటి వ్యాపారమే. ఇప్పటికంటే ఆ వర్తకంలోనే ఇంకా బాగా కిట్టుబాటు కావచ్చును. సరేకాని ఇంకోమాట: నీకు గాంధీ స్లోగన్సు ఏమైనా వచ్చునా?' అన్నాడు. 'రా'వన్నాను. వెంటనే, 'అట్లాపనికిరాదు. రేపు ప్రజలముందర ఏమన్నా మాట్లాడాలంటే గాంధీ గారి సూత్రాలు బాగా రావాలి సుమా?' అని హెచ్చరించి మరీ వెళ్ళాడు. వాడి నోట్లో యింత బెల్లంకొట్టా, పాపం వాడు చెప్పిందంతా అక్షరాలా నిజమే అయింది. ఇప్పుడు కిట్టుబాటుకూడా మునపటికంటె బాగానే వృద్ధిఅయింది. మొత్తానికి స్వరాజ్యం చాలా లాభకరమైందేనండీ!

సరే, యిది యిట్లా వుంటూండగానే అడ్డంకులు కూడా యెన్నోవున్నై మరి. ఈ ప్రజ లున్నారు చూశారూ? వూరుకున్నట్టే వూరుకుని అమాంతంగా లేస్తారండీ! 'అన్యాయం! దోపిడి! అక్రమం!' అంటూ అప్పుడప్పుడు లేస్తూనేవుంటారు. అయితే మనం వూరుకుంటామూ? 'అరాచకం' ప్రబలిపోతోంది—అని లాఠీ ప్రయోగిస్తే సరి! మొండిబండవాళ్లు ఒక్కొక్కప్పుడు అక్కడికీ వూరుకోరు. 'ఇదంతా కమ్యూనిస్టుల పన్నాగం' అని ఒక్కమాటన్నామంటే చాలు—అక్కడితో నోటికి తాళం పడిపోతుంది.

అంతా అనుకూలంగానే వుందిగాని, అవేవీ—పత్రికలో పెచ్చికలో,—వాటివిషయం మాత్రం కొంచెం అసాధ్యంగానేవుంది చెప్పొద్దూ! వాళ్ళ దేదో పడిపోయినట్లుగా మామీద రాస్తారు. ఆ గడుగ్గాయలు మొత్తానికదేమిటోగాని, సరిగ్గా చూసినట్లే అన్ని సంగతులూ వ్రాస్తారు. పాపం వాళ్ల ఉద్దేశం, అవన్నీ చదివి మనం మనస్సు మార్చుకుంటామనిగావును! కాకపోతే చదవటానికి కాస్త బాగానే వుంటై. అప్పుడప్పుడు కులాసాకి చదువుతూ, నవ్వుకుంటూంటాను నాలో నేనే! వాళ్ళ ఉద్దేశం, కనీసం పై అధికార్లన్నా నిజం తెలుసుకుని సరైన చర్య తీసుకుంటారని గావును! అసలు పై అధికార్లెవరు? మేమంతా ఒక కుటుంబంలోని వాళ్ళంగాదూ! ఇంతకూ నిజమెవరికి తెలీదంటూ! ఇదంతా బహిరంగరహస్యం. నే నిదివరకు కాంగ్రెసు వ్యతిరేకుణ్ణని వాళ్ళకి

తెలుసు; తరువాత కొద్దో గొప్పో వర్తకం చేస్తూం టానని వారికి తెలుసు. అయితే యేం, నావంటి పెద్దమనిషిని యెవరేం చెయ్యగలరు గనక! ఏదో వాళ్ళనూ, మనకూ లోపాయికారిగావున్న అవినాభావసంబంధాన్ని పురస్కరించుకుని వాళ్ళా నడుచుకుంటున్నారు, మనమూ వుంటున్నాము-మధ్య యీ ప్రజ లెవరంటాను!

ఇట్లావుండగానే మొన్న నారాయుడు కనపడి మరోమాట చెవిని వేశాడు. వాడికీ ఈమధ్య పెద్దవుద్యోగమే అయిందిట—ఎమ్. ఎల్. ఏ. అనుకుంటా. మొన్న కనపడి 'ఏం, వ్యవహారం బాగా సాగుతున్నట్లేనా ? నీకేమోయ్, మంత్రివి కూడా అయినావు! ఇహ పట్టిందల్లా బంగారమేగా ?' అన్నాడు. 'అ, నీపనిమాత్రం తేలిగ్గా వుందా యేమిటి ? ఈమధ్య భూమీ పుట్రా కూడా కొన్నావుటే ?' అన్నాను. 'అవునోయ్! ఏదో కాంగ్రెసు చలవవల్ల ఇంటి దాని మెళ్ళో నాలుగు నగలంటూ కూడా యేర్పడ్డయి. కొద్దో గొప్పో డబ్బు వడ్డీమీద కూడా తిరుగుతోంది దనుకో. అయినా నీకూ నాకూ సాటి ఎక్కడోయ్?' అన్నాడు. 'అదేమన్న మాట! కాంగ్రెసు పదికాలాలపాటు చల్లగా వుండాలే గాని నువ్వుమాత్రం ఆస్థితికి రాకపోతావా?' అన్నాను. 'మరో చిన్న విషయం. గాంధీ మెమోరియల్ ఫండు డబ్బు పోగుచెయ్యటం నీద్వారానే జరుగుతోం-ది-టే......?' అన్నాడు. అప్పుడు మాకు జరిగిన సంభాషణ యిది.

'ఆహా—నా ద్వారానే జరుగుతోంది, సలక్షణంగా.'

'చూడు......ఏమన్నా......?'

'గోడలకు చెవులుంటై సుమా! చెవులో చెపుతా దగ్గిరికిరా......!'

'ఆహా—! అసాధ్యుడివోయ్! అయితే...'

'మరేం భయంలేదు;...అదీ సంగతి! మరే, లేకపోతే నాకేం బట్టిందోయ్ సంత!'

అంతే; ఎక్కడి దొంగ లక్కడే—గప్‌చిప్.

సరే ఆ విషయం అట్లా వుండనీండి. ఇప్పుడు కథ కొంచెం అడ్డం తిరుగుతున్నట్లుగా కనపడుతోంది. మన రహస్యాలు కాస్తా ఇట్టే బయటకు లాగేస్తున్నారు ప్రజలు. అయితే మనమేనా తెలివితక్కువ వాళ్ళం! మాట్లాడితే గాంధీగారిమీద వుపన్యాసం దంచేసి నోరుమూయిస్తున్నాం. అదికూడా యీమధ్య సాగేట్టు కనపట్టంలేదు. సరే కానీండి, ఎంతవరకు సాగితే అంతవరకూ సాగుతుంది. ఏ పార్టీ అయితే మనకేం. వ్యాపారం బాగా సాగాలేగాని! అంతగా ఏదైనా అవాంతరం ఒస్తే అప్పటి వుపాయం అప్పుడు!

అదుగో, ఎవరో పిలుస్తున్నట్టున్నారు - ఎవరో పెద్దవాళ్ళే నాతో మాట్లాట్టానికి ఒచ్చివుండాలి. లేకపోతే, 'ప్రజల తరఫువాళ్ళం' అంటూ ఒచ్చే బికారి వాళ్ళకు దర్శన మిస్తామా యేమిటి? మన హోదా యెక్కడ, ప్రజలెక్కడ! ఒరే వెంకా, వాకిట్లో సోఫా శుభ్రం చెయ్యి. దబ్బునముందిట్లా వచ్చి ఆ గాంధీ టోపీ వెతికి యివ్వు. పక్కగదిలో రాట్నం, కదురూకూడా వున్నై—త్వరగా తెచ్చి నాముందర పెట్టు; పో. ఆవచ్చిన వారితో, 'అయ్యగారు నూలువడుకుతున్నారు లోపలికి దయచెయ్య' మని చెప్పు. త్వరగా, పో.


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు: మదరాసు

(Estd:  1907

జారీచేసి చందావేయబడిన మూలధనం రూ. 72,00,000

అడిగిన మూలధనము. రూ. 53,00,000

రిజర్వ్ ఫండ్ రూ. 62,00,000

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలు చేయబడును.

యన్. గోపాల అయ్యర్,

కార్యదర్శి.